RNI.NO. TGBIL/26/A0701

# తొలిప్రభ

తెలుగు దినపత్రిక

WWW.toliprabha.com

హైదరాబాద్ | సోమవారం 27.04.2026 | సంపుటి:1 | సంచిక:50 | పేజీలు:4 | వెల:రూ.5

రిపోర్టర్లు కావలెను




ప్రజల గొంతుకగా వస్తున్న తొలిప్రభ దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని జిల్లాలలో స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు సంప్రదించండి.

ఫోన్: 9951205067

## అణు రంగంలో చరిత్రాత్మక విజయం

### భారత్‌లో తొలి ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ

- కల్పకంలో స్వదేశీ టెక్నాలజీతో రూపొందిన రియాక్టర్ పనిచేయడం ప్రారంభం
- పవన విద్యుత్‌లో కీలక ముందడుగు
- పవన విద్యుత్ ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డ్ - 56 గిగావాట్లు దాటిన సామర్థ్యం
- శాస్త్రవేత్తలకు మోదీ అభినందనలు
- కంటికి కనిపించని పవన శక్తే దేశ అభివృద్ధిని ముందుకు నడిపిస్తోంది : మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ
- అణు, పవన శక్తి రంగాల్లో దూసుకుపోతున్న భారత్




**తొలిప్రభ , నేషనల్ బ్యూరో**

భారత్‌లోనే తొలిసారిగా తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం చారిత్రక మైలురాయి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ ఘన విజయాన్ని సాధించడం ద్వారా భారత అణు శాస్త్రవేత్తలు దేశానికి కీర్తిని సాధించి పెట్టారని ప్రశంసించారు. ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్‌ను తొలిసారిగా క్రిటికాలిటీ దశకు చేర్చడంలో భాగమైన అందరు శాస్త్రవేత్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఆదివారం రోజు మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈవివరాలను వెల్లడించారు. కొన్ని రోజుల క్రితమే కల్పకంలోని న్యూక్లియర్ రియాక్టర్ పని చేయడం మొదలుపెట్టిందని ఆయన చెప్పారు. ఆ న్యూక్లియర్ రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతోనే తయారు చేయడం అనేది పెద్ద విషయమన్నారు. పౌర అణు ఇంధన కార్యక్రమం సాధిస్తున్న విజయాల కారణంగా దేశ పారిశ్రామిక, ఇంధన, ఆరోగ్య రంగాల వికాసానికి ఊతం లభిస్తోందని మోదీ తెలిపారు. దీనివల్ల రైతులు, ఆధునిక ఆవిష్కర్తలకూ చేదోడు లభిస్తోందన్నారు. భారతదేశ వికాసంతో సైన్సుకు బలమైన సంబంధం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విజన్‌తోనే భారత శాస్త్రవేత్తలు అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. వారి చొరవల ఫలితంగా అంతరిక్ష కార్యక్రమం సైతం భారత

మిగతా 2లో





## ట్రంప్‌ను టార్గెట్ చేసిన తుపాకీ

### వైట్ హౌస్ డిన్నర్‌లో కాల్పుల కలకలం

- బుల్లెట్ల వర్షం నుంచి తృటిలో తప్పించుకున్న అమెరికా అధ్యక్షుడు
- వైట్ హౌస్ డిన్నర్‌లో రక్తపు మరకలు – అధ్యక్షుడిపై కాల్పుల యత్నం
- షాట్‌గన్, కత్తులతో చొరబడ్డ దుండగుడు, గాయపడిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్
- హిల్టన్ హోటల్‌లో హైడ్రామా – ట్రంప్ ఎదుటే గన్‌మ్యాన్ బీభత్సం
- "ఇది మొదటిసారి కాదు, లక్ష్యం నేనే" అన్న ట్రంప్, ఉలిక్కిపడ్డ అమెరికా
- అగ్రరాజ్యానికి షాక్

**తొలిప్రభ , నేషనల్ బ్యూరో**

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో జరిగిన ప్రతిష్ఠాత్మక వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కార్యక్రమం కాల్పుల ఘటనతో ఒక్కసారిగా అగ్రరాజ్యమంతా ఉలిక్కిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఆ కార్యక్రమంలో ఓ దుండగుడు బహుళ ఆయుధాలతో భద్రతా చెక్‌పాయింట్ పైకి దూసుకొచ్చి కాల్పులకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. భద్రతా సిబ్బంది సమయోచితంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పినా, ఘటన తర్వాత ట్రంప్ కూడా తనే లక్ష్యంగా కాల్పులు జరిపినట్లు చేసిన వ్యాఖ్యలు చేయడం

మిగతా 2లో



### "మమతా, కాంగ్రెస్ హయాంలో ఉగ్రవాదులకు బిర్యానీలు"

- బెంగాల్‌లో గూండా రాజ్యానికి ముగింపు పలుకుతాం - ఓటర్లకు అమిత్ షా పిలుపు"

2




### ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

- రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన ఆప్
- పార్టీ ఫిరాయించిన ఏడుగురు ఎంపీల సభ్యత్వం రద్దు చేయాలి

2

## ప్రజావాణి సేవలు గడప గడపకు: సీఎం రేవంత్‌రెడ్డి

- రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలి
- అర్జీల పరిష్కారంపై పకడ్బందీ వ్యవస్థ అమలు చేయాలని అధికారులకు సీఎం సూచన
- ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుడికి అప్‌డేట్స్ ఇవ్వాలి



**తొలిప్రభ , హైదరాబాద్**

ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు ప్రజావాణి సేవలను మరింత చేరువ చేయాలని, రెవెన్యూ డివిజన్‌స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే అర్జీల పురోగతిని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు.

## 'కుడితిలో పడ్డ ఎలుక'లా బీఆర్ఎస్ పరిస్థితి

### కవిత నాయకత్వంలోనే నిజమైన తెలంగాణ వాదం బతుకుతుంది

- తెలంగాణ వాదాన్ని బీఆర్ఎస్ చంపేసింది:
- ఉద్యమకారులను కొట్టించిన వారికే పదవులు అప్పజెప్పారు
- కవితతోనే తెలంగాణకు మోక్షం
- మీరు వదిలేసిన తెలంగాణ వాదాన్ని మేము మోస్తున్నాం :నవీన్ ఆచారి
- కవిత సేన వచ్చాక బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి
- బీఆర్ఎస్ తెలంగాణ వాదాన్ని అవమానించింది

2



### మేల్కొలుపు

అమెరికా వైట్ హౌస్ లో...
దుండగుల కాల్పుల కలకలం
అధ్యక్షుడు ట్రంప్ వైఖరిపై...
స్వదేశీ అసహనమే
పర్యవసానం...

భద్రతా దళాల అప్రమత్తతతో
తృటిలో తప్పిన పెనుప్రమాదం
ఈ తరహా విధానాలుంటే...
భవిష్యత్ భద్రతకు విఘాతం

- తేరటి నరసింహ (త్రినేత్ర )

## చర్చలకు ముందు ఆంక్షలు ఎత్తేయండి

### అమెరికాకు ఇరాన్ షరతు

- దిగ్బంధనం, బెదిరింపుల మధ్య శాంతి చర్చలు సాధ్యం కావు - పాక్ ప్రధానికి తేల్చి చెప్పిన పెజెష్కియాన్
- ఇస్లామాబాద్ నుంచి వెనుదిరిగిన ఇరాన్ విదేశాంగమంత్రి
- ట్రంప్ వర్సెస్ పెజెష్కియాన్: ఇస్లామాబాద్ చర్చలు పట్టాలెక్కకముందే బ్రేక్
- "15 గంటల ప్రయాణం వృథా" అంటూ ట్రంప్ వ్యంగ్యం
- యురేనియం శుద్ధి నిలిపివేతపైనే పట్టు
- ముందు నౌకాదళం వెనక్కి, తర్వాతే చర్చలు: ఇరాన్ అల్టిమేటం



**తొలిప్రభ , నేషనల్ బ్యూరో**

అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక కామెంట్స్ చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. శనివారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శాంతి

మిగతా 2లో

# చర్చలకు ముందు ఆంక్షలు ఎత్తేయండి

**తరువాయి భాగం**



చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు 'ప్రెస్ టీవీ' నివేదించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**ఇరాన్- అమెరికా చర్చలపై హైడ్రామా**

ఇదిలా ఉండగా, శనివారం అమెరికాఇరాన్ మధ్య ఇస్లామాబాద్‌లో చర్చలు జరుగుతాయని అందరూ భావించారు. అయితే శనివారం రాత్రి కాసేపు హై డ్రామా నడిచింది. చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లిన ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రతినిధులు రాకముందే ఒమన్ బయల్దేరి వెళ్లిపోయారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఫ్లోరిడాలోని పామ్ బీచ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. పాకిస్థాన్‌లో జరగాల్సిన ఉన్నత స్థాయి శాంతి చర్చలకు తన ప్రతినిధులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్‌లను పంపడం లేదని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని కీలక కామెంట్స్ చేశారు. తమ ప్రతినిధుల పాకిస్థాన్ పర్యటన వల్ల సమయం, ఖర్చు వృథా అవుతాయని ఆయన వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ తెలియని వ్యక్తులతో సమావేశమవ్వడానికి 1516 గంటల పాటు ప్రయాణం చేయడం వృథా అంటూ పేర్కొన్నారు. ఇరాన్ అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు మాత్రం ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు.

**ఒమన్ నుంచి పాకిస్థాన్కు ఇరాన్ విదేశాంగమంత్రి ?**

ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్ను పాకిస్థాన్కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. అయితే, శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా? అన్నది అనుమానమేనని ఆయన చెప్పుకొచ్చారు. ప్రస్తుతం అబ్బాస్ అరాగ్చీ ఒమన్ పర్యటనలో ఉన్నారు. అయితే, చర్చల కోసం ఆయన తిరిగి పాకిస్థాన్‌కు వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి. ఒకవేళ అరాగ్చీ తిరిగి పాకిస్థాన్కు వస్తే, ట్రంప్ తన బృందాన్ని పంపిస్తారా? లేదా? ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా, అమెరికాతో చర్చల అంశంపై ఇరాన్లో సైన్యం, రాజకీయ నాయకత్వం రెండుగా చీలిపోయినట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకత్వం, ఐఆర్జీసీ మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఐఆర్జీసీ తీరును వ్యతిరేకిస్తూ సీనియర్ రాజకీయ నాయకులంతా ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీకి లేఖ రాసినట్లు తెలుస్తోంది.

# 'కుడితిలో పడ్డ ఎలుక'లా బీఆర్ఎస్ పరిస్థితి

**తొలిప్రభ , హైదరాబాద్**

కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ప్రకటించిన తర్వాత కుడితిలో పడ్డ ఎలుక'లా బీఆర్ఎస్ పరిస్థితి అయిందని టిఆర్ఎస్ పార్టీ నాయకుడు నవీన్ ఆచారి విమర్శించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సేన రాష్ట్ర నాయకుడు నవీన్ ఆచారి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత ప్రకటించిన 'తెలంగాణ రాష్ట్ర సేన' తర్వాత బీఆర్ఎస్ పరిస్థితి 'కుడితిలో పడ్డ ఎలుక'లా మారిందని టీఆర్ఎస్ నేత వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వదిలేసిన తెలంగాణ వాదాన్ని తాము మోస్తున్నామని, తెలంగాణకు 'ఇంటిపార్టీ' కావాలనే కవిత పార్టీ పెట్టారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ వాదాన్ని పక్కన పెట్టిందని, కవిత నాయకత్వంలోనే నిజమైన తెలంగాణ వాదం బతుకుతుందని అన్నారు. ఉద్యమకారులను కొట్టించిన కడియం శ్రీహరిని పార్టీలోకి తీసుకొచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని ఆరోపించారు. తెలంగాణ తల్లి, జయశంకర్ సార్ విగ్రహాలను ప్రభుత్వం పెట్టలేదని, జాగృతి తరపున తాము డబ్బులు పెట్టి పెడతామన్నా అనుమతించలేదని మండిపడ్డారు. కేసీఆర్‌పై పోటీ చేసిన జీవన్ రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంపై ప్రశ్నించారు. తెలంగాణ వాదులను కొట్టించిన వ్యక్తిని బీఆర్ఎస్ లోకి ఎలా తీసుకుంటారని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే శృతి, వివేక్, సాగర్ అనే చిన్న పిల్లలను ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే గొప్ప పరిపాలన కవిత అందిస్తారని, ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేరుస్తారని నవీన్ ఆచారి ధీమా వ్యక్తం చేశారు.

# ట్రంప్‌ను టార్గెట్ చేసిన తుపాకీ

**తరువాయి భాగం**

మరింత సంచలనంగా మారింది. ఇదేం మొదటిసారి కాదని కూడా అనడంతో గత ఘటనలు కూడా చర్చనీయాంశమయ్యాయి.

**ఘటన ఇలా జరిగిందా ?**

వాషింగ్టన్‌లోని ప్రముఖ హిల్టన్ హోటల్‌లో డిన్నర్ నిర్వహించారు. రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరైన ఆ కార్యక్రమానికి అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే కార్యక్రమం జరుగుతున్న సమయంలో అనూహ్యంగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూ చెక్‌పాయింట్ వైపు దూసుకొచ్చాడు. అతడి వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు పలు కత్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది అతడిని ఆపేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో కాల్పులు చోటు చేసుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌కు గాయమైంది. అయితే అతడు ధరించిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ కారణంగా ప్రాణాపాయం తప్పిందని అధికారులు తెలిపారు. గాయపడిన అధికారి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు.

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు 11శాతం ఫిట్‌మెంట్

**తొలిప్రభ , తెలంగాణ స్టేట్ బ్యూరో**



టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడంతో సంస్థలోని 37,360 మందికి ప్రయోజనం కలగనుంది. 2021 సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించాయి. ఆర్టీసీ ఉద్యోగులకు 11 % ఫిట్‌మెంట్ ఇస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహా మంత్రుల బృందం శుక్రవారం అర్ధరాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు 2021 సంవత్సరం ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన వారికి సైతం ఈ ప్రయోజనం లభించనుంది. వారి సర్వీసును బట్టి కండక్టర్లకు రూ.4,000 నుంచి 15,000, డ్రైవర్లకు రూ.4,000 నుంచి 17,000 వరకు వేతనాలు పెరుగుతాయని కార్మిక వర్గాలు తెలిపాయి.

12 % ఇవ్వాలని పట్టుబట్టిన ఐకాస నేతలు : ఆర్టీసీ ఐకాస 32 డిమాండ్లలో అతి ప్రధానమైనది వేతన సవరణ. ఆర్టీసీ యాజమాన్యం 5, 8, 10 % ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ ప్రతిపాదనల్ని తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది. చర్చల సందర్భంగా పది శాతానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరించి ప్రకటనకు సిద్ధం అమవుతున్న తరుణంలో ఆర్టీసీ ఐకాస నేతలు 12 % ఇవ్వాలని పట్టుబట్టారు. మళ్లీ గంటన్నర పాటు చర్చలు జరిగాయి. చివరకు 11 % ఫిట్‌మెంట్‌కు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది.

రూ.2,400 కోట్లకుపైనే భారం : వేతన సవరణతో ఆర్టీసీపై ఆర్థిక భారం భారీగా పడనుంది. 2021 సంవత్సరం ఏప్రిల్ నుంచే అమలు చేయాల్సి ఉండటంతో 5 సంవత్సరాల బకాయిలు చెల్లించాలి. ప్రసుత్తం పని చేస్తున్న ఉద్యోగులకే రూ.2,178 కోట్ల పైచిలుకు చెల్లించాల్సి ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి నివేదించింది. విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సింది రూ.230 కోట్లు. మొత్తంగా రూ.2,400 కోట్లకుపైనే భారం పడుతుందని టీజీఎస్ఆర్టీసీ ఉన్నత అధికారులు లెక్కలు వేశారు. మరోవైపు ప్రతినెలా ఉద్యోగులకు చెల్లించే వేతనాల ఖర్చు పెరగనుంది. 11 % ఫిట్‌మెంట్‌తో ప్రతి నెలా అదనంగా వేతనాల కోసం రూ.34.6 కోట్లు చెల్లించాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం లెక్కలు వేసింది. సంవత్సరానికి జీతాల అదనపు భారం రూ.415.2 కోట్లు అని అధికారులు అంచనా వేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఖ్య 9,600 : ఫిట్‌మెంటు బకాయిలు 2021 సంవత్సరం ఏప్రిల్ తరువాత రిటైర్ అయినవారికి ముందు చెల్లిస్తారు.



# మమతా, కాంగ్రెస్ హయాంలో ఉగ్రవాదులకు బిర్యానీలు

- మోదీ వచ్చాక సర్జికల్ స్ట్రైక్స్: అమిత్ షా
- బెంగాల్‌లో గూండా రాజ్యానికి ముగింపు పలుకుతాం - ఓటర్లకు అమిత్ షా పిలుపు"
- మొదటి దశలోనే టీఎంసీని తుడిచిపెట్టేశారు - 110 సీట్లు మావే: షా ధీమా"
- "పహల్గాం దాడికి ఆపరేషన్ సిందూర్‌తో బదులు - ఉగ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేశాం

**తొలిప్రభ , తెలంగాణ బ్యూరో**

బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడియాలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. గతంలో బంగాల్లో మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబించాయని ఆరోపించారు. కానీ 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ లాంటి చర్యలతో ఉగ్రదాడులకు నిర్ణయాత్మకమైన సమాధానం ఇచ్చిందని అన్నారు. మమతా బెనర్జీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించేవారు. 2014లో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చాక, ఉరీలో దాడి జరిగితే మేము సర్జికల్ స్ట్రైక్ చేశాం. పుల్వామాలో దాడి జరిగితే ఎయిర్ స్ట్రైక్ నిర్వహించాం. పహల్గాంలో దాడి చేసినప్పుడు, నేరుగా పాక్ గడ్డపైకి వెళ్లి ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించాం. ప్రధాని మోదీ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారు."టీఎంసీని తుడిచిపెట్టేశారు!

నాడియా జిల్లాలోని టెహట్టాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా, మమతా బెనర్జీ సర్కార్పై విమర్శల జల్లు కురిపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలోనే ఓటర్లు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేశారని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 23న జరిగిన మొదటి దశ ఎన్నికల్లోనే బీజేపీ 110 సీట్లను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'బంగాల్ బాధ్యతలు బీజేపీ చేపడితే ఇక్కడ కొనసాగుతున్న గూండా రాజ్యం, సిండికేట్ రాజ్లకు ముగింపు లభిస్తుంది. ఓటు వేసేందుకు బయటకు రావడానికి ఎవరూ భయపడకండి. ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసింది. మిమ్మల్ని ఓటు వేయకుండా ఆపడం ఎవరి వల్లా కాదు' అని అమిత్ షా ఓటర్లకు పిలుపునిచ్చారు. అయితే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో, అమిత్ షా తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా ఈ సీనియర్ బీజేపీ నేత తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది

**గూండాల పనిపడతాం!**

అంతకు ముందు, అంటే శనివారం టోలీగంజ్లో అమిత్ షా భారీ రోడ్ షో నిర్వహించారు. ఆ సందర్భంగా బంగాల్ ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే, టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. "నేను ఇప్పుడు గూండాలకు హెచ్చరిస్తున్నా. ఏప్రిల్ 29న మీ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. లేకపోతే మే 5వ తేదీ తర్వాత మీపై కనికరం ఉండదు. ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు తల్లులు, సోదరీమణులు, యువకులు అందరూ పోలింగ్ బూత్లకు చేరుకుని కమలం గుర్తుపై బటన్ నొక్కాలని నేను కోరుతున్నాను" అని అన్నారు. కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 91.78 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# అణు రంగంలో చరిత్రాత్మక విజయం

**తరువాయి భాగం**

నిర్మాణానికి గణనీయంగా దోహదపడుతోందని తెలిపారు.

**పవన విద్యుత్ రంగంలో ప్రధాన మైలురాయి**

పవన విద్యుత్ అనేది భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కంటికి కనిపించని ఈ పవన శక్తే భారత్‌ను ముమ్ముందుకు నడిపిస్తోందని తెలిపారు. పవన విద్యుత్ రంగంలో భారత్ ఇటీవలే ఒక ప్రధాన మైలురాయిని సాధించిందని, భారత్ పవన విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 56 గిగావాట్లు దాటిందన్నారు.

**ఒక వెదురు ఉత్పత్తిని కొనండి**

"భారతదేశంలో వెదురు రంగంలో ఎంతోమంది పనిచేస్తున్నారు. కళాత్మక వెదురు ఉత్పత్తుల తయారీకి వాళ్లంతా శ్రమిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ రంగంపై ఎక్కువగా ఆధారపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు మీరంతా కనీసం ఒక వెదురు ఉత్పత్తిని కొనండి. దీన్ని మీరు ఎవరికైనా గిఫ్టుగా ఇచ్చుకోవచ్చు. వెదురు ఉత్పత్తుల సేల్స్ పెరిగితే ఈ రంగంలో పని చేస్తున్న వారి ఆత్మస్థైర్యం పెరుగుతుంది" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.



# బీరప్ప జాతరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**తొలిప్రభ , పరిగి**

మండలంలో నస్కల్ గ్రామంలో జరిగిన బీరప్ప జాతర ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు జాతర శుభాకాంక్షలు తెలిపారు. కుర్వ సామాజిక వర్గ ప్రజలు పవిత్రంగా జరుపుకునే ఈ జాతర ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. బీరప్ప స్వామి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. నస్కల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

**తొలిప్రభ , ఢిల్లీ**



తమ పార్టీని వీడి ఇటీవలే బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్కు పిటిషన్ సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఆ ఏడుగురు ఎంపీల చర్య పార్టీ ఫిరాయింపు నిరోధక చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అందుకే వారి సభ్యత్వాన్ని పార్టీ ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలని రాజ్యసభ ఛైర్మన్ ను కోరినట్లు తెలిపారు.

# శ్రీ ఆది వరహాస్వామి ఆలయ అభివృద్ధికి పాటుపడతాం

■ ప్రమాణస్వీకారంలో నూతన కార్యవర్గం.

**తొలిప్రభ కమాన్ పూర్.**

కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వారహ క్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం అని నూతన పాలకవర్గం స్పష్టం చేశారు. ఆదివారం రోజున నూతన పాలకవర్గాన్ని దేవాదాయ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ ఆలయ ఈవో కాంతారెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. చేసిన వారిలో చైర్మన్ గా ముస్త్యాల దామోదర్(జూలపల్లి) అలాగే డైరెక్టర్లుగా . తాళ్ల భాగ్యశ్రీ (రొంపి కుంట) సాగి శ్రీనివాస్ రావు (నాగారం) మల్యాల మల్లేష్(కమాన్ పూర్) పిల్లి రాజు పిల్లి పల్లె ( కమాన్ పూర్) బూస శ్రీనివాస్( కమాన్ పూర్) తీగల రాజయ్య (ములకలపల్లి) చాట్ల రాయమల్లు (కమాన్ పూర్) కొంతం శ్రీనివాస్ (కమాన్ పూర్) గాజుల శ్రీనివాస్ (గుండారం) కుందారపు శంకర్ (రొంపి కుంట) తిమ్మరాజు గిరిజ -సంతోష్ కుమార్ (కమాన్ పూర్) అనవేన శ్యామ ల(జూలపల్లి) బొజ్జ సతీష్ (జూలపల్లి) కలకుంట్ల వరప్రసాద చార్యులు (ఎక్స్ అఫీషియో సభ్యులు) ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అభిమానులు నాయకులు వారిని ఘన సన్మానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నియమించడం జరిగిందని వారికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మిగిలిపోయిన రోడ్డు పూర్తి అయ్యేలా మంత్రి దృష్టికి తీసుకు వస్తామని వారు పేర్కొన్నారు. ఆలయానికి మిగిలి ఉన్న పనులు పూర్తి చేస్తామని అన్నాడు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, సింగల్ విండో మాజీ చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, సర్పంచులు గుమ్మడి శ్రీనివాస్, బంగారు కళ్యాణి మహేష్, బొంగోని సదయ్య, పొన్నగంటి కుమార్, ఉప సర్పంచులు రఫీ సోహెల్, కొత్తపల్లి సతీష్, ఉడ్నాల శ్రీనివాస్, అంబిరి రాజేందర్, గడ్డం రాజమహేందర్,మాజీ ఎంపిటిసి పిల్లి శేఖర్, నాయకులు జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్,ఇనగంటి రామారావు, శివ శంకర్, అంబిలి శ్రీనివాస్, గడప కృష్ణమూర్తి, మల్యాల తిరుపతి, మల్యాల మహేష్, పంజా సాయిరాం గౌడ్, లల్లు, సయ్యద్ ఇక్బాల్, నగునూరి నరసయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆదివారహ స్వామి పాలకవర్గం


మాట్లాడుతున్న చైర్మన్ దామోదర్


మంత్రిని సన్మానిస్తున్న టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్

# ఆర్టీసీ విలీనం చారిత్రాత్మక నిర్ణయం

**తొలిప్రభ, ఆమనగల్లు :**

ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. హైదరాబాదు నుండి శ్రీశైలం వెళుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆదివారం ఆమనగలు పట్టణంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేసిన, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్నీ హర్షిస్తూ మంత్రిని సత్కరించి అభినందించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ మొదలైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోయి విపక్షాల కుట్రలను ఎండగట్టాలన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్తోనే సాధ్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో పెరిగిన రద్దీ కనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచినట్లు చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరిక మేరకు కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు కేటాయించడం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ నుంచి కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ గౌడ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు శ్రీకాంత్, ఖరీదు, సురేష్, అలీమ్ తదితరులు ఉన్నారు.



# ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు ఘన సన్మానం

**తొలిప్రభ, అమనగల్లు :**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను ఆదివారం ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్లోని ఆయన నివాసంలో కోదండరాంను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోదండరాంను ఎమ్మెల్సీగా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఈనెల 28న మెగా హెల్త్ క్యాంప్

**తొలిప్రభ, ఆమనగల్లు :**



ఈనెల 28న యాచారం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్టార్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ నియో పోలిష్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ ఆసుపత్రిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో జనరల్ పరీక్షలు, డయాబెటిక్ పరీక్షలు, కంటికి సంబంధించిన పరీక్షలు,దంత సంబంధించిన పరీక్షలు, నిర్వహిస్తున్నట్లు పాషా తెలిపారు. ఈ సదావకాశాన్ని యాచారం గ్రామ సమీప ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.




# ఆర్టీసీ ఉద్యోగుల విజయానికి చారిత్రాత్మక అడుగు

■ సీఎం రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం

■ పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్, బాలాజీ సింగ్

**తొలిప్రభ, కడ్తాల్:**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తీసుకున్న ధైర్యవంతమైన, చారిత్రాత్మక నిర్ణయానికి మద్దతుగా కడ్తాల్ మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు బిచ్యా నాయక్, పట్టణ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ విలీనం అనేది ఉద్యోగుల గౌరవానికి, భవిష్యత్ భద్రతకు పెద్ద బలమని పేర్కొన్నారు. 11శాతం పిఆర్సి అమలు, గుర్తింపు సంఘాల ఎన్నికలు, ఖాళీల భర్తీ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సానుకూల సంకేతాలు ఇవ్వడం, కొన్ని డిమాండ్లపై వ్రాతపూర్వక హామీ ఇవ్వడం ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. గత గత కేసీఆర్ అవినీతి ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులకు మోసపోరితమైన హామీలు ఇచ్చి ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేశారన్నారు. కానీ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో ఆర్టిసి ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఇది సాధారణ నిర్ణయం కాదని, ఇది సంకల్పం అని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి మరియు మంత్రి వర్గానికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, సేవలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్, కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, వార్డు సభ్యులు నూర్జహాన్ జహంగీర్ బాబా, భాను కిరణ్, చేగురి మమత మహేష్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ ఇమ్రాన్, మండల అధ్యక్షులు బోస్ రవి, నాయకులు యాదయ్య గౌడ్ పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి..

**తొలి ప్రభ. పరిగి :**

పరిగి పట్టణంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు.



# మహిళలే లక్ష్యంగా అఘాయిత్యాలు..

■ పాత నేరస్తుడు అరెస్ట్

**తొలిప్రభ, ఆమనగల్లు :**

నాగర్కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉల్పర గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ముకురాల రాజేందర్ అలియాస్ శివను పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారికి రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికి నిర్మానుష ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడటంతో పాటు నగదు, నగలు దోచుకోవడం ఇతని శైలి. ఇటీవల కుప్పగండ్లకు చెందిన ఓ మహిళను అమనగల్లుకు పిలిపించి, చింతలపల్లి శివారులో ఆమె నుంచి రూ. 31,000 విలువైన బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. నిందితుడిపై గతంలో డిండి, కల్వకుర్తి, లింగాల, వంగూరు పోలీస్ స్టేషన్లలో అత్యాచారం, దొంగతనం వంటి పలు కేసులు నమోదయ్యాయి. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకుని, అతని వద్ద నుంచి సెల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించారు.



# కోదండరాంకు ఉద్యమకారుల శుభాకాంక్షలు

**తొలిప్రభ , ఇబ్రహీంపట్నం**

తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొ. కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులవడంపై తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఇబ్రహీంపట్నం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దివారం ఉద్యమ నాయకులు ప్రొ. కోదండరాం నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కోదండరాం నియామకం తెలంగాణ ఉద్యమకారులందరికీ గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు లలాగారి జంగయ్య, ప్రొద్దుటూరు రవీందర్ గుప్త, డి. రమేష్, ఎ. అంజయ్య, యం.డి. ముజీప్, యం.డి. గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మొండిగౌరెల్లి భూసేకరణలో అక్రమాల ఆరోపణలు

**తొలిప్రభ, ఇబ్రహీంపట్నం**



రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో పారిశ్రామిక పార్క్ పేరుతో భూసేకరణలో కోట్ల రూపాయల అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోదుకొండ్ల ప్రవీణ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెం. 19, 68, 127లలో మొత్తం 677 ఎకరాల 29 గుంటల ఎకరాల ప్రభుత్వ భూమిని గతేడాది సేకరణకు నోటిఫై చేశారు. భూకబ్జాదారులు అధికారులతో కుమ్మక్కై గుట్టలు, బండలను కూడా కబ్జా భూమిగా చూపి ఫోటోలు దిగుతున్నారన్నారు. సోమన్న గుడి వద్ద గుండం మినహా మిగిలిన గుట్టలన్నీ కబ్జాలో చూపిస్తున్నారని ఆరోపణ చేశారు. గతంలో గుట్టలకు రైతుబంధు తీసుకున్న నేతలే ఇప్పుడు భూసేకరణ పేరుతో కోట్ల దందా చేస్తున్నారని విమర్శించారు. సాగుకు అనుకూలంగా ఉన్న కబ్జా భూములకు మాత్రమే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గుట్టలు, బండలకు పరిహారం ఇవ్వొద్దన్నారు. రైతు భూమి సర్వే వివరాలను రైతుకు వెంటనే తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోకపోతే యాచారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించారు. రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకులతో కలిసి ముదుపుల దందా నడుపుతున్నారని ఆయన ఆరోపించారు.



## వాసవి మాత జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి

**తొలి ప్రభ. పరిగి :**

పరిగి పట్టణంలో వాసవి మాత జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి,భక్తులతో కలిసి ఆశీర్వాదాలు పొందారు.సమాజంలో ఐక్యత, సేవా భావం పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు.

## బీదలకు వైద్య సేవలు అందించాలి

**తొలిప్రభ కమాన్ పూర్**



గ్రామీణ ప్రాంతాల్లోని బీదలకు వైద్య సేవలు అందించాలి అని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జీవన రేఖ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తక్కువ ధరలో వైద్యం చేయాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగినచో పట్టణ ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని ఇటువంటి ఆస్పత్రులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు సౌకర్యంగా ఉంటాయని అన్నారు. డాక్టర్ నరేష్, డాక్టర్ షీలా, , డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవీందర్, కొండి ప్రవీణ్ , మారం సతీష్, అవును వారి జ్యోతి,తో పాటు ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, పిల్లి శేఖర్, లల్లు, సయ్యద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## మంత్రులు శ్రీధర్ బాబు భట్టిలను కలిసిన సర్పంచ్

**తొలిప్రభ కమాన్ పూర్. రామగిరి మండలం**



కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కట్టి విక్రమార్క ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని ప్రగతి భవన్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీ ధర్ బాబు, తెలంగాణ న్యాయ సలహ సెక్రటరీ రేండ్ల తిరుపతిని, కలవచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి హైదరాబాద్‌లోని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం చేశారు. సందర్భంగా, నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా మొదటిసారి కలిసినందుకు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## కేపీఎల్ లో దుద్దిళ్ల సైన్యం విజయం

**తొలిప్రభ కమాన్ పూర్.**

కమాన్ పూర్ మండల కేంద్రంలో గత గత వారం రోజులుగా కొనసాగుతున్న కేపీఎల్ క్రికెట్ పోటీల్లో దుద్దిళ్ల సైన్యం విజయదుందవి మోగించింది. రామన్న సూపర్ కింగ్స్ వర్సెస్ దుద్దిళ్ల సైన్యం పోటీ పడగా ముందుగా బ్యాటింగ్ చేసిన రామన్న సూపర్ కింగ్స్ 7 వికెట్ల నష్టానికి 10 ఓవర్లలో 96 పరుగులకు చేసింది. వంశి 34 పరుగులు, పెండ్లి వినోద్ 23 పరుగులు, చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన దుదిల్ల సైన్యం ఐదు వికెట్ల నష్టానికి 97 పరుగులు చేశారు. ఇందులో అనవేన కొండయ్య 66 పరుగులతో టీం గెలుపులో కీలకపాత్ర వహించారు. అనవేన కొండయ్య ఎంపికయ్యారు.

## ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి వేడుకలు

- **మండల అధ్యక్షుడు సదానంద చారి**

**తొలిప్రభ, మానకొండూర్**

మహావిష్ణు స్వరూపుడు కాలజ్ఞాన తత్వవేత్త ఇప్పటికి ప్రపంచంలో దేశంలో ఏదైన వింతజరిగిందంటే అంతా బ్రహ్మంగారు చెప్పినట్టే జరుగుతుందని, భక్తులప్రగాఢవిశ్వాసం, నమ్మకం మహనీయుడు శ్రీ మద్విరాట్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ,సజీవ సమాధి రోజును కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని కేశవపట్నంలో వెంకయ్య గుట్ట వద్ద, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధక్షుడు , కన్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తాటికొండ సదానంద చారి ఆధ్వర్యంలో, ఎరడపల్లి గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు ధర్మకర్త పోలోజు మల్లయ్యఆచారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలోజు సుమన్ శాస్త్రి, సంఘ ఉపాధ్యక్షులు నర్సింగోజు కృష్ణ, ప్రచార కార్యదర్శి కస్తూరి రమేష్, సంఘం నాయకులు నర్సింగోజు రాజు, జయ ప్రకాష్ వెంకటేశ్వర్లు రాములు చారి సంతోష్ చారి పవన్ చారి అజయ్ నాగుల సత్యనారాయణ, హనుమాన్ దీక్ష పరులు, మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

# హలో.. హలో.. సరిగ్గా వినిపిస్తుందా..?

- **మక్త మాదారంలో మొబైల్ సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
- **ఏళ్ల కాలంగా టవర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న పట్టించుకోని వైనం**
- **బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలని ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందించి సమస్య వివరించిన నాయకులు**





**తొలిప్రభ, కడ్తాల్:**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో ఫోన్ మాట్లాడుతుంటే మధ్యలోనే వాయిస్ కట్ అయిపోతుంటుంది. 'హలో హలో సరిగా వినిపిస్తోందా. కొంచెం ఆగు, బయటకు వస్తున్నా. లేకపోతే ఇక్కడ సిగ్నల్ లేదు. వేరేచోటుకి వెళ్లాక చేస్తా' ఇలాంటి మాటలెన్నో మనం అప్పుడప్పుడు వింటుంటాం. కానీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం సమీపంలో ఉన్న ఈ గ్రామం.. మక్త మాదారం ..ప్రజలకు సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ప్రపంచం ఓ పక్క 5జీ సాంకేతికతతో పరుగులు పెడుతుంటే, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నేటికీ పూర్తిస్థాయిలో సెల్ టవర్ సేవలు అందట్లేదు. ఈ సిగ్నల్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు మార్లు ఎయిర్టెల్, జియో , బిఎస్ఎన్ఎల్, వీఐ నెట్వర్క్ లకు వివరించిన సిగ్నల్ సమస్య మాత్రం తీర్చడం లేదు.

### మక్తమాదారంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలి..



**మక్త మాదారం గ్రామంలో మొబైల్ సిగ్నల్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో బ్యాంక్, మీసేవ, పెన్షన్ పంపిణీకి నెట్వర్క్ సమస్య చాలా ఇబ్బందిగా మారింది. టవర్ ఏర్పాటు చేయాలని టవర్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా కోరుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోని టవర్ ఏర్పాటుకు కృషి చేయాలి. లేదంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం.**

**- నింగ్యారి యాదగిరి, వార్డు సభ్యుడు (మక్తమాదారం)**

**మొబైల్ సిగ్నళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు..**

మక్తమాదారం గ్రామంలో సిగ్నళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసర ఫోన్ కాల్ చేయాలనుకున్నప్పుడు నగరాల్లో, పట్టణాల్లో ఉన్న వారికి ఏ సమస్య రావడం లేదు కానీ గ్రామంలో ఉన్న ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజు రోజుకు సెల్‌ఫోన్ల సంఖ్య పెరగిపోవడంతో ఉన్న ఒకే టవర్ జియో సామర్థ్యం సరిపోవడం లేదు. సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. శనివారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభానికి వచ్చిన ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేసి సిగ్నల్ సమస్యను తీర్చాలని కోరారు.

### ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో టవర్ ఏర్పాటుకు కృషి



**ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే వినతులు అందించాం. మరోసారి ఎంపీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తా. టవర్ విషయంలో ఎంపీ మల్లు రవి సానుకూలంగా స్పందించారు. ప్రజలకు సిగ్నల్ సమస్య లేకుండా టవర్ ఏర్పాట్లు చేసేందుకు ఎంపీ దృష్టికి తీసుకెళ్తా.**

**ఆరోక్కటం బాల్ రాజ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ( కడ్తాల్ మండలం)**

# పరుగే ప్రగతి..!

- **ఉత్సాహాన్ని నింపిన 'అవంతిక తెలంగాణ ప్రోమో రన్'**
- **స్వయంగా 5కే రన్ లో పాల్గొన్న ఎసిపి రమేష్**
- **రన్నర్స్ ను అభినందించిన నగర్ మేయర్ మహంకాళి స్వామి**
- **రన్నర్స్ కు మెడల్స్ అందజేసిన మేయర్, ఏసీపీ**





**తొలిప్రభ కమాన్ పూర్.**

"గుడ్ మార్నింగ్ గోదావరిఖని.. గుడ్ మార్నింగ్ రామగుండం..." ఇదే నినాదంతో ఆదివారం తెల్లవారుజామున కోల్‌బెల్ట్ నగరం మేల్కొంది. గోదావరిఖని లోని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం పరిసరాలు వందలాది రన్నర్స్ అడుగులతో సందడిగా మారాయి. హైదరాబాద్‌కు చెందిన సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2K, 5K, 10K "అవంతిక తెలంగాణ ప్రోమో రన్-2026" యువతలో, ఉద్యోగుల్లో, మహిళల్లో, వృద్ధుల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశంతో జరిగిన ఈ రన్ కార్యక్రమానికి 500 మందికిపైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, మరో 100 మందికి పైగా స్వచ్ఛందంగా వచ్చి పాల్గొన్నారు. ఎవరి సామర్థ్యానికి తగ్గట్టు వారు 2కే, 5కే, 10కే పరుగు పూర్తి చేసి తమ లక్ష్యాన్ని సాధించారు. గెలుపు కంటే పూర్తి చేయడమే ముఖ్యమని రన్నర్స్ నిరూపించారు.

**ఫిట్ తెలంగాణకు గోదావరిఖని నుంచి బలమైన అడుగు..**

రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో ఇదే తరహాలో ప్రోమో రన్‌లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జూన్ 7న హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో జరిగే ఫైనల్ రన్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఓపెన్ కేటగిరీలో ప్రతిభ కనబరిచిన వారికి మొత్తం రూ.3 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు. గోదావరిఖని నుంచి కూడా పెద్ద సంఖ్యలో రన్నర్స్ హైదరాబాద్ ఫైనల్ రన్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా సత్తా చాటిన వారికి ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు ప్రకటించడం మరింత ఉత్సాహాన్ని కలిగించింది.

**ఏసీపీ స్వయంగా 5కే పరుగుతో స్ఫూర్తి**

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏసీపీ రమేష్ స్వయంగా 5కే రన్ పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అధికారిగా కాకుండా రన్నర్‌గా ట్రాక్‌పై కనిపించడం యువతలో విశేష ప్రేరణ కలిగించింది. ఆయన మాట్లాడుతూ... "రన్నింగ్ అనేది కేవలం వ్యాయామం కాదు... అది ఒక జీవనశైలి. ప్రతి ఒక్కరి దినచర్యలో పరుగు ఒక భాగం కావాలి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా రన్నింగ్ ఎంతో అవసరం" అని అన్నారు. జూన్ 7న హైదరాబాద్‌లో జరిగే ఫైనల్ రన్‌లో గోదావరిఖని నుంచి పాల్గొనే వారికి ప్రత్యేక ప్రోత్సాహకంగా 10కేలో సత్తా చాటిన వారికి రూ.10 వేలు, 5కేలో ప్రతిభ చూపిన వారికి రూ.5 వేలు నగదు బహుమతిని పోలీస్ శాఖ తరుపున తన వ్యక్తిగతంగా అందజేస్తామని ప్రకటించి రన్నర్స్‌ను మరింత ఉత్తేజపరిచారు. ప్రస్తుత సమాజంలో గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాలు బానిసగా మారుస్తున్న యువతను, ఇలాంటి రన్ కార్యక్రమాలు కొత్త ఉత్తేజాన్ని కలిగిస్తాయని అన్నారు. ప్రతిఒక్కరూ రోజు మైదానం బాటపట్టాలని పిలుపునిచ్చారు.

**"ఆరోగ్య రామగుండం కోసం పరుగు అవసరం..."**

పలువురు డాక్టర్లు, ఎస్సైలు, పోలీస్ కానిస్టేబుళ్లు, క్రీడాకారులు, బాలబాలికలు, యువత, మహిళలు, వృద్ధులు రన్ పూర్తి చేసిన వారికి ముఖ్య అతిథి హాజరైన రామగుండం మేయర్ మహంకాళి స్వామి అందరికీ మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... "ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం రన్నింగ్ చేయాలనీ.. ఆరోగ్య రామగుండం కోసం కొంత అవగాహన వచ్చినా, ఇంకా పూర్తిస్థాయిలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రన్ కల్చర్‌ను పరిచయం చేస్తూ సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయని కొనియాడారు. "పరుగెత్తే వ్యక్తి శరీరానికే కాదు... ఆలోచనలకు కూడా వేగం వస్తుంది. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరం" అని పేర్కొన్నారు.

**జుంబా డాన్స్‌తో జోష్..**

రన్నర్స్‌లో ఉత్సాహం నింపేందుకు సర్వేశ్ డాన్స్ మాస్టర్ నేతృత్వంలో డ్యాన్సర్స్ చేసిన జుంబా డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రన్‌కు ముందు, తర్వాత జరిగిన వార్మప్ సెషన్ అందరినీ అలరించింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రన్నర్స్‌కు అల్పాహారం ఏర్పాటు చేశారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించారు.

**నిర్వాహకుల సమన్వయం...**

ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ అర్జీ 2 ఎస్ఓ2 జీఎం రాముడు, సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ అధ్యక్షుడు సోమా జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేష్ పటేల్ తూము, కోశాధికారి పన్నాల హరీష్ చంద్ర రెడ్డి, ఈసీ సభ్యులు రవి, రాజు, సదాశయ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణా రెడ్డి, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు కే ఎస్ వాసు, చంద్రమౌళి, నల్లవెల్లి శంకర్, జబ్బర్ ఖాన్, సోమరపు అరుణ్ కుమార్, లావణ్య, డాక్టర్ వనజా రాపోలు, జ్యోతి, వెల్డి కవిత అనంతరాములు పాల్గొన్నారు.

**పదేళ్ల వయసు.. పది కిలోమీటర్ల పరుగు..**

కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణా రెడ్డి మనుమడు పృథ్వీరాజ్ కు పదేళ్లు. కానీ రన్ కార్యక్రమంలో 10 కిలోమీటర్లు పరిగెత్తి అందరినీ ఆకట్టుకున్నారు. అబ్బురపడిన మేయర్, ఎసిపి, రన్ నిర్వాహకులు సైతం ఈ బాలుని ప్రతిభను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాక్షించారు.

**పరుగు మొదలైతే... మార్పు మొదలైనట్టే...**

గోదావరిఖని ప్రోమో రన్ ఒక సాధారణ క్రీడా కార్యక్రమం మాత్రమే కాదు.. ఆరోగ్యవంతమైన సమాజం వైపు వేసిన బలమైన అడుగు. వందలాది మంది ఒకే లక్ష్యంతో పరుగు పెట్టిన ఈ ఉదయం... "ఫిట్ తెలంగాణ" సంకల్పానికి నిజమైన నాంది అయింది.